ప్రజాశక్తి

శుక్రవారం 1 డిసెంబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

రెండు నెలలు ఆలస్యంగా

నేడు డిఆర్‌సి సమావేశం - కరువు, సాగులో ఇబ్బందులు, ఇతర సమస్యలపై ప్రశ్నించనున్న ప్రజా ప్రతినిధులు



సమావేశం నిర్వహించే హాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లా సమీక్ష సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జరగనుంది. సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్యక్షత వహిస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరగాల్సి ఉన్నా గత జులై తరువాత మళ్లీ ఐదు నెలలకు గురువారం నిర్వహించనున్నారు. సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్, నీటి పారుదల, గృహ నిర్మాణం, జగనన్న కాలనీల్లో ప్రగతి, జాతీయ ఉపాధి హామీ చట్టం, కార్మిక బడ్జెట్, విద్య, వైద్యం, జగనన్న భూ హక్కు తదితర అంశాలపై చర్చించనున్నారు. వివిధ అంశాలపై చర్చల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలు సమస్యలను ప్రస్తావించనున్నారు.

వర్షాభావం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం, వరి, పత్తి, మిర్చి రైతుల ఇబ్బందులపై సభ్యులు ప్రస్తావించే అవకాశం ఉంది. రాబోయే వేసవిలో ఎదురుకానున్న తాగునీటి ఇబ్బందులు, సాగర్ జలాశయం నుంచి నీటి విడుదల, డ్యామ్‌లో 13 గేట్లను పోలీసులు అధీనంలోకి తీసుకోవడం తదితర అంశాలపైనా చర్చించనున్నారు. ఇప్పటికే సాగర్, పులిచింతల జలాశయాల్లో నీటి నిల్వలు పెరగకపోవడం, పట్టిసీమ నుంచి నీటి విడుదలను నిలిపివేయడం తదితర కారణాలతో రబీలో వరికి నీరివ్వలేమని అధికారులు ప్రకటించారు. అంతేగాక రెండో పంటగా డెల్టాలో జొన్న, మొక్కజొన్న సాగుకూ అనుమతివ్వలేమని కేవలం మినుము, పెసర మాత్రమే సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ సూచించింది. ఈ అంశాలను ప్రజా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకురానున్నారు.

గృహనిర్మాణమూ మందకొడిగా సాగుతోంది. జగనన్న భూ హక్కు సర్వేపై పలు వివాదాలు ఏర్పడ్డాయి. రికార్డుల్లో పలువురి భూముల వివరాలు మారిపోతున్నాయని విమర్శలు వస్తున్నాయి. జగనన్న భూ హక్కు పథకం ద్వారా 223 గ్రామాల్లో సర్వే ప్రారంభించారు. 5.95 లక్షల ఎకరాల భూమి ఉంది. మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో కలిపిన గ్రామాలతోపాటు, సిఆర్‌డిఎ పరిధిలోని 29 గ్రామాల్లో సర్వే జరగడం లేదు. మొత్తంగా 50 గ్రామాల్లో సర్వే పనులు మినహాయించారు. మిగతా 173 గ్రామాల్లో రీసర్వే పనులు మందకొడిగా జరుగుతున్నాయి. సమావేశంలో పాల్గొనాల్సిన వారిలో టిడిపి నుంచి నూతనంగా ఎన్నికయిన ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తుండగా ఎంపి గల్లా జయదేవ్ ఏడాదిగా జిల్లాకు రావడం లేదు.



డ్యాం వద్ద ఏపీ పోలీసులు

నాగార్జున సాగర్ డ్యాం వద్ద ఉద్రిక్తత

- పోలీసు బందోబస్తు మధ్య కుడి కాల్వకు నీరు విడుదల
- పోలీసు బందోబస్తులో ఆంధ్ర ప్రాంతంలోని ప్రాజెక్టు పరిసరాలు

వార్త మెయిన్‌లో

మహిళపై హింసలేని సమాజం రావాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఐక్యరాజ్య సమితి 2023 నాటికి మహిళలపై హింసలేని సమాజాన్ని చూడాలని కోరుకుంటోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. గురజాడ అప్పారావు 108వ వర్ధంతి సందర్భంగా మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజీలో 'హింసలేని సమాజం, స్త్రీల ప్రాధాన్యత' అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమాదేవి మాట్లాడుతూ స్త్రీ, పురుష అసమానతలు, సమాజంలో స్త్రీల ప్రాధాన్యత, హింసలేని సమాజంపై ప్రసంగించారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఐద్వా పోరాడుతోందని చెప్పారు. డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ గురజాడ రచనలు సమాజంలో మహిళలపై ఎలా ప్రభావం చూపుతున్నాయో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసకుమార్, అడ్మిషన్ డీన్ డాక్టర్ రమేష్‌బాబు, ప్రొఫెసర్ జె.కిషోర్‌బాబు పాల్గొన్నారు.



రమాదేవికి జ్ఞాపిక అందచేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



ఏపుగా పెరిగి పూత రాలిపోతున్న మిర్చి మొక్కలను పరిశీలిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

మిర్చిరైతు కంట నకిలీల కారం

- మొక్కకు ఐదారు కాయలైనా నిలవని వైనం
- రైతు భరోసా కేంద్రంలో ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- బాధిత రైతుల పొలాలను పరిశీలించిన కౌలురైతు సంఘం
- ఎకరాకు రూ.1.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - మేడికొండూరు

ఎన్నో ఆశలతో మిర్చిని సాగు చేపట్టిన రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టిన వ్యాపారులు నిలువునా ముంచారు. అధికారులకు బాధిత రైతులు విన్నవించినా పట్టించుకోపోవడంతో కౌలురైతు సంఘానికి తమగోడు వెళ్లబోసుకున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని సిరిపురంలో బాధితుల పొలాలను కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, నాయకులు బి.రామకృష్ణ గురువారం పరిశీలించారు.

గ్రామానికి చెందిన పలువురు రైతులు, కౌలు 50 ఎకరాల్లో యుఎస్ అగ్రి సీడ్స్ వారి ఎస్డబ్ల్యూ 450 రకం విత్తనాలను సాగు చేశారు. ఎకరాకు రూ.1.66 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టారు. అయితే పూత రాలిపోవడం, చిగురు బలహీనంగా ఉండడం, చెట్టుకు నాలుగైదు కాయలకు మించి లేకపోవడం తదితర లక్షణాలను గుర్తించిన రైతులు తాము మోసపోయామనే నిర్ధారణకు వచ్చారు. దీనిపై గతనెలలో స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా అధికారుల నుండి స్పందనేమీ లేకపోవడంతో కౌలురైతు సంఘం నాయకులను సంప్రదించారు. ఈ నేపథ్యంలో పొలాలను పరిశీలించడంతోపాటు బాధిత రైతుల నుండి వివరాలను నాయకులు సేకరించారు. ఈ సందర్భంగా ఎం.హరిబాబు మాట్లాడుతూ నకిలీల వ్యవహారంపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలన్నారు. రైతు కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండాలంటే నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం కింద ▶ 2లో



సాగుదారులకు పట్టాలు ఇస్తున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

రెండు వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 2 వేల ఎకరాలకు పొలాలకు భూహక్కు పట్టాలను కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గురువారం పంపిణీ చేశారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులోని కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పొలాలను 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారిని ప్రభుత్వం గుర్తించి ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

రైల్వే లైన్‌కు భూములను అప్పగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడ-గూడూరు మూడవ రైల్వే లైనుకు సంబంధించి జిల్లా పరిధిలో సేకరించిన భూముల్లో పెండింగ్‌లో ఉన్న స్థలాలను వెంటనే రైల్వే శాఖకు అప్పగించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు తన ఛాంబర్‌లో గురువారం రైల్వే శాఖాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ▶ 2లో

ఎస్సీ, ఎస్టీల సమస్యలపై 4న చలోఢిల్లీ

2లో



ఉపా కేసులను ఎత్తేయాలి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

భారత బచావో ఆల్ ఇండియా నాయకులు డాక్టర్ ఎంఎస్ గోపీనాథ్, గాదె ఇన్నయ్య తదితరులపై ఉపా చట్టం కింద నమోదు చేసిన కేసులను వెంటనే రద్దు చేయాలని భారత్ బచావో, వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మతతత్వ భావజాలానికి వ్యతిరేకంగా 'ఇండియా' కూటమికి అనుకూలంగా ప్రచారం చేయాలని భారత్ బచావో నిర్ణయించిందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణలో ప్రచారం చేశారని, బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారనే దురుద్దేశంతో గోపీనాథ్, ఇన్నయ్య, ఇతరులపై ఉపా చట్టాన్ని ప్రయోగించారని మండిపడ్డారు. కార్యక్రమంలో భారత బచావో పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.కోట నాయక్ , షేక్ సర్దార్, పిడిఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రావు, నాయకులు వై.వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, ఎన్.రామారావు, సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి జె.కృష్ణ నాయక్, వివిధ సంఘాల నాయకులు బి.కవితా భాయ్, బి.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, ఎ.కోటిరెడ్డి, అబ్రహాం లింకన్ పాల్గొన్నారు.



ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటేయండి

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్నికల్లో ఓటరు భాగస్వామ్యం, ఓటు వేయడంపై ప్రజలను చైతన్య పర్చేందుకు చేపట్టిన 'స్వీప్' కార్యక్రమాల్లో భాగంగా గురువారం పట్టణంలో ప్రదర్శన చేశారు. ర్యాలీని స్వీప్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేయాలని, పోలింగ్ శాతం పెంచడానికి బిఎల్ఓలు కృషి చేయాలని కోరారు. వికలాంగ ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు వీల్‌ఛైర్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయం నుండి శివయ్య స్తూపం, పల్నాడు రోడ్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. ఆర్టీవో ఎం.శేషిరెడ్డి, డిఎల్‌డిఒ వెంకటరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శ్రీరాముల్ రెడ్డి, తహశీల్దార్ బి.కిరణ్‌కుమార్, కమిషనర్ పి.వెంకయ్య, ఎలక్షన్ డిటి పి.తులసీరామ్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-అచ్చంపేట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కొండూరు సర్పంచ్ కె.శ్రీదేవి అన్నారు. రాష్ట్రానికి జగనే మళ్లీ ఎందుకు సిఎం కావాలి అనే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎవరి సిఫార్సులతోనూ ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ఇంటి వద్దకే వచ్చాయన్నారు. అన్ని సమస్యలనూ సచివాలయాల్లోనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాధవి చొప్పరపు రామయ్య, కె.రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు సిహెచ్ వెంకటేశ్వరరావు, టి.బాలస్వామి, బి.ఆనంద్‌కుమార్, వెంకాయమ్మ పాల్గొన్నారు.



గొంతు చించుకున్నా కనికరించరా..

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికుల ఆవేదన
- పర్మినెంట్ చేయాలని నిరసన ప్రదర్శన
- సమస్యలపై ఆర్‌డిఒ కార్యాలయంలో వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న తమను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. దీనిపై తాము ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోవడం లేదని, గొంతు చించుకుని అడుగుతున్నా కనికరించడం లేదని ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం నరసరావుపేటలోని పురపాలక సంఘం కార్యాలయం వద్ద నుండి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ కార్మికుల్లో 99 శాతం మంది దళితులే ఉన్నారని, వీరికి న్యాయం చేయకుండా నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ సిఎం ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. నరసరావుపేటలో మున్సిపల్ కౌన్సిల్ లేకపోవడం వల్ల కార్మికులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.సాల్మన్ మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని కనీస వేతనం రూ.26 వేలు, కొబ్బరి నూనె, చెప్పులు, సబ్బులు, బట్టలు ఇవ్వాలని కోరారు. చనిపోయిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుని పిఎఫ్ డబ్బులు నామినికి చెల్లించాలని, చనిపోయిన కార్మికులకు మట్టి ఖర్చులు వెంటనే ఇవ్వాలని అన్నారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సిహెచ్.వి నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లయ్య, యోహాను, నాయకులు పి.ఏసు, కృపారావు, నరసింహారావు, పి.జాన్, జీవరత్నం, విజయమ్మ, లుదియమ్మ, కార్మికులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

ప్రాక్టికల్ మార్కుల్లో వివక్ష ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ మార్కులలో వివక్షత చూపారంటూ కంప్యూటర్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ విజయ్ కుమార్‌పై విద్యార్థులు హయ్యర్ ఎడ్యుకేషన్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిమిత్తం ఉన్నతాధికారులు కాలేజీలో గురువారం విచారణ చేపట్టారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ బీకాం కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సర విద్యార్థులు సుమారు 20 మంది ఉన్నారని, వారిలో ఎక్కువమంది విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో 70 శాతం మార్కులకు పైగా సాధించారని చెప్పారు. కానీ కంప్యూటర్ సైన్స్ ప్రాక్టికల్స్‌లో లెక్చరర్ విజయభాస్కర్ కావాలని తమపై వివక్షతో చూపుతూ అందరికీ తక్కువ మార్కులను వేశారని, దీనిపై ప్రిన్సిపాల్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందిచలదేన్నారు. ప్రాక్టికల్స్ మార్కులు తక్కువగా రావడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగాలకు నష్టం జరుతుదుందని, తమకు న్యాయం చేయాలని కోరారు. విచారణలో ఆర్‌జెడి విఆర్ జ్యోష్ణకుమారి, కె.శ్రీనివాసరావు, డి.కళ్యాణి హాజరయ్యారు.


విచారణ కోసం వచ్చిన అధికారులు



అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - గుంటూరు

అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని వైసిపి రాష్ట్ర నాయకులు బాల అంజిరెడ్డి కోరారు. ఈ మేరకు బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషను బాపట్ల కలెక్టరేట్‌లో గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాలా అంజిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో మౌలిక వసుతులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. రైతుల సమస్యలపై వివరించారు. ఆయనవెంట వైసిపి నాయకులు వాసు తదితరులున్నారు.

రైల్వే లైన్‌కు భూములను అప్పగించాలి

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ-గూడురు మూడవ రైల్వేలైనుకు సంబంధించి మంగళగిరి, పొన్నూరు మండలాల పరిధిలో పెండింగ్‌లో స్థలాలను వెంటనే రైల్వే శాఖకు అప్పగించాలని తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లా పరిధిలో రైల్వే లైనుకు సేకరించిన స్థలాలకు రైల్వే శాఖ అధికారులను సమన్వయం చేసుకొని సర్వే చేసి మార్కింగ్ వేయాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, ఆర్వీఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సుధీర్‌బాబు, అసిస్టెంట్ మేనేజరు మోహన్, కలెక్టరేట్ జి సెక్షన్ డీటీ కాశీరత్నం పాల్గొన్నారు.

మిర్చిరైతు కంట నకిలీ కారం

(మొదటి పేజీ తరువాయి)

రూ.1.50 లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రస్తుత పరిస్థితికి కారణమని, ఇప్పటికైనా ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలనలో బాధిత రైతులు పోపూరి సుబ్బారావు, కాపూరి వీరరాఘవయ్య, నందా రామచంద్రరావు, నందా సురేష్, పప్పుల శివయ్య, పెరవల్లి వీరయ్య చౌదరి, నల్లమోతు పూర్ణయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ ఉన్నారు.

రెండు వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

పట్టాలిస్తోందన్నారు. నిషేధిత భూముల జాబితా నుండి వాటిని తొలగించి సర్వ హక్కులనూ సాగుదార్లకు ఇస్తోందన్నారు. ఇదే క్రమంలో 20 ఏళ్ల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన డీకే పట్టాలకు ఆయా భూమలును వారు అమ్ముకునే హక్కులనూ ప్రభుత్వం కల్పించిందన్నారు. నియోజకవర్గంలో 17 వేల ఎకరాల చుక్కల భూములను నిషేధిత భూముల జాబితా నుండి తొలగించి రైతులకు హక్కులు కల్పించామని, గతంలోనే పట్టాలనూ అందించామని గుర్తు చేశారు. భూ రీ సర్వే ద్వారా ప్రతి రైతుకు భూమి హక్కులు వస్తున్నాయని, అన్ సెటిల్మెంట్ భూ సమస్యలనూ త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. వినుకొండలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి జీవో వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలకు భూ పట్టాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీల సమస్యలపై 4న చలోఢిల్లీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

దళితులు, గిరిజనులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో 4న నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఈ మేరకు గుండిమెడలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక, దళితులు, గిరిజనులపై దాడులు పెరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయకుండా నీరుగార్చేందుకు కుట్ర చేశారని మండిపడ్డారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, మనువాదాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దళితులు, గిరిజనలు, పేదలు చలోఢిల్లీకి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.కృష్ణ, పొట్టయ్య, నాని, మేరమ్మ, సాంబయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా వెళితే మంచి ఫలితాలు : కలెక్టర్

ప్రజాశక్తి - వినుకొండ

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి లక్ష్యం దిశగా పయనించినపుడే మంచి ఫలితాలు సాధించవచ్చని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. వినుకొండ పట్టణంలోని గురుకుల పాఠశాల బాలుర స్కూల్ అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవానికి గురువారం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రైవేటు కార్పోరేట్ విద్యాసంస్థలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు రాణిస్తున్నారని అన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా హాస్టల్ విజిట్‌లో భాగంగా గురుకుల పాఠశాలకు వచ్చానని, విద్యార్థులతో కలిసి నిద్రించినట్లు చెప్పారు. ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలోనే గురుకుల పాఠశాల విద్యార్థి జెట్టి వెంకటేష్ 583 మార్కులతో మొదటి ర్యాంక్, సోంపల్లి వెంకట సాయి 577 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించడం సంతోషకరమన్నారు. గురుకుల పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి సుమారు రూ.1.40 కోట్లు కేటాయించి నట్లు వెల్లడించారు. రూ.18 కోట్ల వ్యయంతో నూతనంగా గిరిజన వసతి గృహాన్ని నిర్మించనున్నా మని , ఇందులో భాగంగా మూడు కోట్లతో పనులు ప్రారంభించామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో బ్రాహ్మణ పల్లి రెవిన్యూ పరిధిలో చెక్క వాగు వద్ద ఐదు ఎకరాల భూమి కేటాయించామన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ రిజన గురుకుల వసతి గృహాన్ని త్వరలో నిర్మిం చనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అంది స్తున్న అవకాశాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్ లను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు ప్రారం భించారు. కార్యక్రమంలో ఆర్డిఓ శేషిరెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని ఎల్. వరలక్ష్మి పాల్గొన్నారు.



వినుకొండలోని గురుకుల బాలుర పాఠశాలలో అదనపు తరగతి గదుల ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 41,974
మిర్చి ఎగుమతి	: 40,321
మిర్చి నిల్వ	: 12,731

మిర్చి ధరలు


రూపాయలలో

334	10,000 - 22,800
నెం.5	9,000 - 18,500
273	16,000 - 18,000
341	10,000 - 19,000
సూపర్ 10	9,000 - 9,000
	నాన్ ఎసి
తేజ	8,500 - 24,000
బడిగి	14,000 - 24,500
దేవనూరు డీలక్స్	10,500 - 19,000
తాలుకాయలు	5,000 - 13,500
	ఎసి
334	9,000 - 22,000
నెం.5	15,000 - 15,000
341	9,200 - 19,000
4884	9,500 - 11,000
తేజ	10,500 - 23,000
బడిగి	15,000 - 23,500
దేవనూరు డీలక్స్	15,000 -15,000
తాలుకాయలు	5,000 -12,000

ఎంపి ని దూషించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - తుళ్లూరు

బాపట్ల ఎంపి నందిగం సురేష్ ను దూషించి బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడివాడకు చెందిన కొడాలి రామరాజు ప్రోద్భలంతో చొరగుడి రవికాంత్ ఎంపి కి ఫోన్ చేసి బూతులు తిడుతూ బెదిరిస్తున్నాడని ఎంపి పిఎ రాజేంద్ర కుమార్ ఫిర్యాదు మేరకు కేసు



నమోదు చేశామని సిఐ ఎం ఆనందరావు గురువారం తెలిపారు. ఎంపి ని దూషించి, బెదిరించడంలో తన స్నేహితులు విజయ్, నాగ బాబుల ప్రమేయం ఉందని రవికాంత్ చెప్పడంతో వారిని కూడా కేసులో చేర్చడం జరిగిందన్నారు.

చందా పెట్టె చోరీ

ప్రజాశక్తి-తాడేపల్లి

నులకపేటలోని మేరిమాత గృహం ముందు ఉన్న చందా పెట్టెను బుధవారం అర్ధరాత్రి దొంగలు పగల గొట్టారు. అందులో ఉన్న సుమారు రూ.20,000 వేలు దొంగలు ఎత్తుకుపోయారు. చర్చి పెద్దలు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీ సులు కేసు దర్యాప్తు చేస్తు న్నారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో మూడు గ్యాస్ బండలు దొంగలు ఎత్తుకు పోయారు.

టిడిపి ప్రధాన కార్యదర్శి ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి-మంగళగిరి



మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో గురువారం సాయంత్రం పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ కి చెందిన హెూండా యాక్టివా 4జీ ద్విచక్ర వాహనంను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకు పోయాడు. పాత బస్టాండ్ సెంటర్లో రియాజ్ ద్విచక్ర వాహ నాన్ని ఓ షాపు ఎదుట నిలుపుదల చేసి పక్కనే మాట్లాడు తుండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ద్విచక్ర వాహనాన్ని అపహరించుకొని వెళ్ళిపోయే సమ యంలో అగంతుకుడిని చూసిన రియాజ్ అడ్డుకునే ప్రయత్నంలో ఆయనను అగంతకుడు నెట్టివేసి వాహనాన్ని స్పీడుగా నడుపుతూ పారిపోయాడు. ఈ మేరకు పట్టణ పోలీసులకు రియాజ్ ఫిర్యాదు చేశారు.

సామాజిక పింఛన్ల సొమ్ము పెంచండి

ప్రజాశక్తి-తాడేపల్లి

వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళల పింఛన్లను నెలకు రూ.6 వేలకు పెంచాలని సిపిఐ నాయకలు 9, 10 సచివాలయాల్లో గురువారం వినతిపత్రం అందజేశారు. అలాగే వికలాంగులకు రూ.7 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.వెంకటయ్య, ఎం.డాంగే, శివ, ఎస్‌కె బాష, శీలం శ్యామ్, శ్రీను పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL SENIOR CIVIL JUDGE NARASARAOPET.
IP.NO: 84/2023

Between:-
Pasumarthi Gangaiah. ...Petitioner.
AND
Karanam Venkata subbaiah,
Shaik Taju, Narisetti kishore,
Chinnam Raju Komali. ...Respondents.
TO,
1) Karanam Venkata subbaiah S/o late Karanam Rangaiah C/o Mastanamma House, beside Vijetha Bar, Ramireddypet, Narasaraopet town, mandal jcjc, Palnadu Dist.
2) Shaik Taju w/o Khaleel, C/o D.No:11-28-27/10, Ramireddypet, Narasaraopet town, mandal jcjc, Palnadu Dist.Cell.No:9133461531.
3) Narisetty Kishore S/o Eenaiah, C/o D.No:11-28-18, Ramireddypet, Narasaraopet town, mandal jcjc, Palnadu, Cell.No: 9550244408.
4) Chinnam Raju Komali w/o Nagaraju C/o D.No:11-28-18, Ramireddypet, Narasaraopet town, mandal jcjc, Palnadu, Cell.No:8074711693.

సదరు పై నెంబర్ IP లోని Petitioner తనను ఇన్సాల్వెంట్ గా ప్రకటించమని పైన తెలిపిన రెస్పాండెంట్ల పై ఐపి దాఖలు చేసి ఉన్నారు పిటిషన్ పైన ఉదహరించిన 1నుండి 4 రెస్పాండెంట్లు కాకుండా ఇంకనూ ఎవరికైనా బాకీ ఉన్న యెడల మీరు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ ది. 26-12-2023 న ఉదయం 10:30 ని.లకు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నరసరావుపేటకు వచ్చి మీకు గల ఆక్షేనలు తెలుపుకొనవలెను.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

వాయిదా.. ది.26-12-2023.

ఇట్లు.
డి.మల్లారెడ్డి, డి.చిన్నపరెడ్డి, ఎస్‌కె.మీరావలి,
జి.ప్రశాంత్‌కుమార్, ఎస్.వై.హనుమాన్‌సాయి,
పిటీషనర్ తరపు న్యాయవాదులు,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

ప్రకటన
మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S 126/2020

Between:-
Indian Bank rep by its B.M.
Narasaraopet Branch ...Plaintiff
And
Patan Razia and Others ...Defendant
To,
(1) Patan Razia W/o Syed Khasim Bude
(2)Syed Isha D/o Syed Khasim Bude
(3) Syed Simran D/o Syed Khasim Bude
(4)Syed Hafeez S/o Syed Khasim Bude
All are Residing Door No.12-13-17/3, 60feet Road, Prakash Nagar, Narasaraopet Town.

పై నెంబరు గల దావాలో వాది అయిన బ్యాంక్ వారు మీ మీద దావా పరిహారం నిమిత్తం దావా వేసినారు. సదరు పైనెంబరు గల దావాలో మీకు ఎన్నిసార్లు మీకు నోటీసులు పంపినను కావాలనే ఉద్దేశ్యముతో మీరు తీసుకొనక పోవడంచేత కోర్టు వారు మీకు ఈ పేరు ద్వారా నోటీసులు జారీ చేయమని ఆర్డరు వేసినారు. కనుక మీరు వాయిదా ది.26-12-2023వ తేదీన మీరుగాని, మీ వకీలు ద్వారా గాని హాజరై పైకోర్టులో మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మిమ్ములను పరోక్షమందుగా తీర్మానింపబడును.

By Order of Court

వాయిదా తేది:26-12-2023

G.Sudheer Kumar,
Advocate,
Narasaraopet.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE, TENALI
I.A. 1255/2023 IN O.S.550/2023

Between :
Bollimuntha Yuva Ashok Kumar
... పిటీషనర్/వాది
and
Bollimuntha Venkateswarlu
.... రెస్పాండెంటు/ప్రతివాది
To,
Bollimuntha Venkateswarlu, S/o late Nagaiah, Private Employee, and Cultivation R/o Kakarlamudi (V), Chadalawada Post, Vemuru Mandal.

పై నెంబరు దావాలో దావా షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని జప్తు చేయమని కోరుచూ పిటీషనరు / వాది పిటీషను దాఖలు చేయగా శ్రీ కోర్టువారు మీకు అనేక పర్యాయములు కోర్టు ద్వారా, పోస్టల్ ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక avoid చేసిన కారణమున శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా మీ నోటీసుకై ది. 5-12-2023కు వాయిదా వేసినారు. సదరు తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు గానీ, మీ ప్లీడరు గారు గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో దావా పిటీషను మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

వాయిదాతేది: 5-12-2023
తెనాలి.

ఇట్లు
షేక్ ఫిరోజ్‌బాషా,
పేట ప్రత్యూష
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్స్,
సెల్ నెం : 92930 52501

IN THE COURT OF THE IV ADDL SENIOR CIVIL JUDGE: GUNTUR
O.S.No.194/2022

Between:-
Velaga Ajay Represented by his GPA agent Mandava Syama Sundara Rao
...Plaintiff
And
Nallabothu Rama Rao & Others
...Defendants
To,
D2:- M/s. Hella Homes Pvt Ltd., Guntur Rep by its M.D, Sangepu Sai Srikanth S/o Venkateswara Rao,
D3:- Sangepu Sai Srikanth S/o Venkateswara Rao, Authorized Signatory of the 2nd Defendant
D2 and D3 R/o Flat No.507 in 5th Floor, Maple, IJM Rain Tree Park Dwaraka Krishna, Nambur, Guntur District-522508

ఈ నెంబరు దావాలో సదరు 2 & 3 ప్రతివాదులకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున 2 & 3 ప్రతివాదులకు దావాపై నోటీసులు Paper Publication నిమిత్తం ది.19-12-2023కి వాయిదా వేసినారు. కావున 2 & 3 ప్రతివాదులు వాయిదా రోజు ఉదయం 10-30 గంటలకు పైకోర్టు వారి ఎదుట హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనియెడల 2 3 ప్రతివాదులను పరోక్షమందు తీర్మానింతురు

ఇట్లు
M.Subba Rao,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE, TENALI
O.S.550/2023

Between :
Bollimuntha Yuva Ashok Kumar ... వాది
and
Bollimuntha Venkateswarlu .... ప్రతివాది
To,
Bollimuntha Venkateswarlu, S/o late Nagaiah, Private Employee, and Cultivation R/o Kakarlamudi (V), Chadalawada Post, Vemuru Mandal.

పై నెంబరు దావాలో దావా షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని జప్తు చేయమని కోరుచూ వాది దావా దాఖలు చేయగా శ్రీ కోర్టువారు మీకు అనేక పర్యాయములు కోర్టు ద్వారా, పోస్టల్ ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక avoid చేసిన కారణమున శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా మీ నోటీసుకై ది. 5-12-2023కు వాయిదా వేసినారు. సదరు తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు గానీ, మీ ప్లీడరు గారు గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

వాయిదాతేది: 5-12-2023
తెనాలి.

ఇట్లు
షేక్ ఫిరోజ్‌బాషా,
పేట ప్రత్యూష
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్స్,
సెల్ నెం : 92930 52501

మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఓ.యస్.నెం.224/15

బిట్వీన్:
చావా మెహర్ చంద్ వీరేష్ ...వాది
మరియు
కంచేటి హనుమంతరావు & వగైరాలు ...ప్రతివాదులు
తూళ్లూరి కళ్యాణ చక్రవర్తి తండ్రి.నరసింహారావు, వయస్సు 43 సం॥లు, నివాసము: డోరు నెం.11-5-15/5 బి, రఘురాం నగర్, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా.

ఈ దావాలో మీకు ఎన్ని పర్యాయములు దావా సమనులు పంపినప్పటికిన్నీ, మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందు వలన మీకు నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తము ఈ దావాను తేది: 05-01-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదీన ఉదయం గం.10-30 గం॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గాని హాజరై పై దావాలో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని యెడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వాయిదా:05-01-2024

బి.చంద్రశేఖర్,
బి.ఎల్.కోటేశ్వరరావు, బి.ఎ, బి.ఎల్,
వాది తరపు న్యాయవాదులు,
సత్తెనపల్లి. పల్నాడు జిల్లా,
సెల్:9290037775

ప్రకటన
మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P No.3/2017 in O.S.No.78/2010

బిట్వీన్:-
1.Shaik Rahamath (Died) 1st D H R
2.Shaik Naseema (Died) 2nd D H R
3.Shaik Naseer
4.Shaik Gouslazam Sandanuddin
...Petitioner's/DHR's
Vs
1.Mohammad Abdul Ameer
2.Mohammad Khasim @ Babu
3.Shaik @ Md.Jahar @ Bujji
...Respondents/JDR's
To,
1st JDR:- Mohammad Abdul Ameer S/o Mohammad Saheb(Late), R/o Bank Empolyee, C/o Mohammad Shamsun Rtd.ASI, R/o 9th Lane, NRL Sai Teja Apartment, Srinivasaraopet, Guntur City.
2nd JDR:- Mohammad Khasim @ Babu S/o Late Mohammad Saheb, Musilm, C/o Naseema, School Teacher, R/o Opp.Padmavathi Apartments, Ponnuru Road, Guntur City. Now Residency at 11th Lane, IDPL Colony, Old Guntur, Guntur Town & Dist.
3rd JDR:-Shaik @ Md.Jahar @ Bujji W/o Yunus Basha, (Police Consistable) Musilm, R/o Revenue Quarters, Bellamkonda Cross Road, Bellamkonda Police Station, Now Working Pedakurapadu PS, Pedakurapadu Village, Post, Sattenapalli DMC, Guntur D.t.

ఈ నెంబరు అమలు దరఖాస్తునందు మీరు 1, 2 మరియు 3వ జె.డి.ఆర్ లు అయి ఉన్నారు. శ్రీ కోర్టు నుండి మీకు CPC Order 21 Rule 32 ప్రకారము ఎన్ని పర్యాయమలు నోటీసులు పంపిననూ బుద్ధిపూర్వకముగానే తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము సదరు అమలు దరఖాస్తు ది. 15-12-2023న వాయిదా అయి ఉన్నదని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియపరచటమైనది. సదరు వాయిదా రోజు ఉ.గం. 10-30 ని.లకు శ్రీకోర్టువారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియపరచవలయును. లేనిచో సదరు అమలు దరఖాస్తును మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచటమైనది.

వాయిదా తేది:15-12-2023

చిలకలూరిపేట,

ఇట్లు
కె.రామకృష్ణ,
ప్రత్తిపాటి వీరయ్య,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాదులు,
చిలకలూరిపేట. సెల్ : 95059 81176



మంత్రి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఇఒ, అర్చకులు

ఆలయాన్ని సందర్శించిన మంత్రి విశ్వరూప్ దంపతులు

ప్రజాశక్తి-అమరావతి

కార్తీక మాసం సందర్భంగా స్థానిక శ్రీ బాల చాముండిక సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పి.విశ్వరూప్ దంపతులు గురువారం సందర్శించారు. మంత్రికి ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపినాథ్‌శర్మ, అర్చకులు స్వాగతం పలికారు. మంత్రి వెంట వైసిపి మండల నాయకులు హనుమంతరావు, పిడుగురాళ్ల రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ శివ నాగేశ్వరరావు ఉన్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

చామర్రులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల కేంద్రమైన అచ్చంపేట పరిధిలోని చామర్రులో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అందుబాటులో ఉండే విధంగా ఆరోగ్య కేంద్రాలను నిర్మించి గర్భిణుల, బాలింతలకు స్థానికంగానే పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. రూ.20.8 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. అనంతరం రూ.15 లక్షల సిడిఎంఎఫ్‌సి నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వీరబాబు, చామర్రు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు మూర్తి, ఎఎన్‌ఎంలు, అంగన్వాడిలు పాల్గొన్నారు.

గదులను ఖాళీ చేసేదాకా ఉద్యమం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

తమ కార్యాలయంలోని గదులను ఆక్రమించిన పయనీర్ ఆటోమొబైల్ షాపు యజమానులు వెంటనే ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తూ పెన్షర్లు చేపట్టిన ధర్నా గురువారం 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గదులను ఖాళీ చేసే వరకూ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జె.లక్ష్మీనారాయణ, ఎ.ప్రభుదాస్, మురహరిరావు, ప్రతాపరెడ్డి, రామారావు, సైదులు, కెబిఆర్‌జె ప్రసాద్, లియోరాజు, రామకోటయ్య, రామాదేవి, ఉషారాణి, శృంగారం, నాసరయ్య, సుబ్బారావు, సంగీతారావు, ఖాదర్‌వలి, రమేష్, మృత్యుంజయారావు, ఏడుకొండలు, వెంకట్రావు పాల్గొన్నారు.



హలో.. పట్టణంలో డెంగీ కేసులున్నాయా.. లేవు సార్..

- పారిశుధ్యంపై ప్రశ్నించగా వైద్యులకు చైర్మన్ ఫోన్
- సమస్యలను పట్టించుకోవడం లేదని వైసిపి కౌన్సిలర్ విమర్శలు
- శిలాఫలకాలకు రూ.5 లక్షల కేటాయింపుపై అభ్యంతరం
- చర్చ జరుగుతుండగానే ముగిసినట్లు ప్రకటించిన చైర్మన్



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు.. మాట్లాడుతున్న చైర్మన్ (ఇన్‌సెట్)

ప్రజాశక్తి-చిలకలూరిపేట

హలో.. మన టౌన్‌లో డెంగీ కేసులున్నాయా...? లేవు సార్.. ఓకే సార్.. మన పట్టణంలో డెంగీ కేసులేమీ లేవంట.. కౌన్సిల్ సమావేశంలో పారిశుధ్యంపై ఓ కౌన్సిలర్ ప్రశ్నించగా అనంతరం ఫోన్‌లో జరిగిన సంభాషణ.. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ షేక్ రఫానీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ప్రధానంగా పారిశుధ్యం, కుక్కల బెడదపై ప్రతిపక్ష టిడిపి, అధికార వైసిపి కౌన్సిలర్లు ప్రశ్నించగా శిలాఫలకాలకు రూ.5 లక్షల కేటాయింపుపై టిడిపి కౌన్సిలర్ ప్రశ్నించారు. పారిశుధ్యంపై టిడిపి కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దోమలు విజృంభిస్తున్నాయని, డెంగీ, ఇతర జ్వరాలతో జనం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీనిపై సమాధానం చెప్పాలని అధికారులను చైర్మన్ కోరగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ వివరణిచ్చారు. పారిశుధ్య నిర్వహణలో లోపాలేమీ లేవని అన్నారు. ఇదే సందర్భంలో ప్రభుత్వ వైద్యులకు చైర్మన్ ఫోన్ చేసి పట్టణంలో డెంగీ కేసులేమైనా ఉన్నాయ? అని ప్రశ్నించగా లేవని వారు సమాధానమిచ్చారు. ఈ విషయాన్ని సభాముఖంగా చైర్మన్ చెప్పారు. దీనిపై కొద్దిసేపు వాదన అనంతరం వైసిపికి చెందిన 10 వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడారు. తాను ప్రతి సమావేశంలోనూ సమస్యలను చెబుతు న్నానని, అయినా చైర్మన్, అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వెలిబుచ్చారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని, కళామందిర్ సెంటర్ ఎదురుగా ఉన్న మున్సిపల్ దుకాణాల్లో అద్దెలు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవడం లేదని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వారికి మద్దతిస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రయణికులు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నా పట్టణంలో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయడం లేదని అన్నారు. ఈయనకు మరో కౌన్సిలర్ అన్నపురెడ్డి శ్రీలక్ష్మీ మద్దతు పలికారు.

ఇదిలా ఉండగా తన వార్డులో అభివృద్ధి పనులు చేయడం లేదని, విక్ష చూపుతున్నారని టిడిపి కౌన్సిలర్ కొత్త కుమారి ఆరోపించారు. శిలాఫలకాలకు రూ.5 లక్షలు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ శిలాఫలకాలకు నిధులు మున్సిపాల్టీ ఎందుకు భరించాలని, కాంట్రాక్టర్ పెట్టుకోవాలి కదా? అని అధికారులను వివరణ అడిగినా అధికారులు సమాధానం దాటవేశారు. పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్‌లో ఆర్చి నిర్మాణంపై టిడిపి కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్చి నిర్మాణంపై మంత్రి రజిని ఫొటో పెట్టడాన్ని తప్పుబట్టారు. ప్రజల డబ్బులతో నిర్మించే ఆర్చిమీద ఫొటోలు తగదన్నారు. అయితే ఇందుకు అధికార పక్ష కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. ఇలా చర్చ జరుగుతుండగానే సమావేశం ముగిసినట్లు చైర్మన్ ప్రకటించగా టిడిపి కౌన్సిలర్లు కొద్దిసేపు నిరసన తెలిపారు.

డబుల్ ఎంట్రీ ఓట్లు ఇవిగో..

- కలెక్టర్‌కు జాబితాను ఇచ్చిన జీవీ ఆంజనేయులు
- బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశం
- అవకతవకలను ఇంకా గుర్తిస్తే వివరాలివ్వాలని జీవీకి సూచన

ప్రజాశక్తి - వినుకొండ



కలెక్టర్‌కు వివరాలు చెబుతున్న జీవీ ఆంజనేయులు

డబల్ ఎంట్రీ ఓట్లపై ఆధారాలతో బిఎల్‌ఒలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ఓటరు జాబితాలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కోరారు. వ్యవసాయ భూమి పట్టాల పంపిణీ కోసం పట్టణానికి గురువారం వచ్చిన కలెక్టర్‌ను తశీల్దార్ కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. షేక్ మౌలాలి, ఫరీజా దంపతుల ఓట్లు బూత్ నెంబర్-34, 207, 194 మూడు బూత్‌లలో ఓట్లు ఉన్నాయని, దేవెళ్ల రాము, పిచ్చమ్మ దంపతుల ఓట్లు బూత్ నంబర్ -274, 205లో ఉన్నాయని 255, 245, 46 బూత్‌లలో కుందేలు నరసింహకు ఓట్లు ఉన్నాయంటూ సుమారు 100 ఓట్లకు పైగా డబుల్ ఎంట్రీలు ఉన్నాయని జాబితాను కలెక్టర్‌కు చూపారు. వీటిని పరిశీలించిన కలెక్టర్.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన బిఎల్‌ఒలకు షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశించారు. ఇలాంటి అవకతవకలు ఇంకా ఉంటో ఆధారాలను ఇవ్వాలని జీవీ ఆంజనేయులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జీవి ఆంజనేయులు మాట్లాడుతూ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లోనైన బిఎల్వోలు, ఎన్నికల అధికారులు.. టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని అన్నారు. ఓటమి భయంతోనే ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు దొంగ ఓట్లను చేర్పిస్తున్నారని ఆరోపించారు. టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించడమే లక్ష్యంగా ఫారం -7 దరఖాస్తు చేస్తున్నారని విమర్శించారు. దీనిపై చర్యలు తీసుకోకుంటే న్యాయ పోరాటం చేస్తామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టిడిపి నాయకులు సుబ్బారావు, మురళికృష్ణ యాదవ్, బ్రహ్మయ్య, బి.గోవిందరాజులు, అజీజ్, అనీల్, ప్రశాంత్ ఉన్నారు.

సరిహద్దు బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా సరిహద్దు బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి మండలం కంటెపూడి సమీపంలో పల్నాడు జిల్లా సరిహద్దు బోర్డులను ఎంపిడిఓ జీవి సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు గురువారం ఏర్పాటు చేశారు. మండల సరిహద్దు బోర్డులనూ పెట్టారు.





మహేశ్వరిని సత్కరిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

ఫుట్‌బాల్ క్రీడాకారిణికి సత్కారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జాతీయ ఫుట్‌బాల్ జుట్టుకు ఎంపికైన సత్తెనపల్లి క్రీడాకారిణి మహేశ్వరిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ గురువారం సత్కరించారు. పట్టణంలోని సత్తెనపల్లి శరభయ్య హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సత్తెనపల్లి శివసాయి ఫుట్‌బాల్ క్లబ్లో శిక్షణ తీసుకుంటున్న మహేశ్వరి అండర్-14 బాలికల జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి సత్తెనపల్లికి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. కోచ్ సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తెలుగు యువత పట్టణ మాజీ అధ్యక్షులు ఎలినేటి శ్రీనివాస్ సహకారంతో క్లబ్‌కు ఫుట్‌బాల్ నెట్‌లను అందించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పూజల వెంకట కోటయ్య, బాపయ్యచౌదరి, ఎం.రామచంద్రరావు, బిఎల్ చిన్నయ్య, పి.ఆంజనేయులు, అజయ్ పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణములోని పురుషోత్తమపట్నం శివారులోని గిరిజన పాఠశాలలో హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ అన్నారు. భవనం పిచ్చులూడడంతోపాటు చాలాచాలని గదుల్లో బస చేయాల్సిన దుస్థితిలో విద్యార్థులున్నారని చెప్పారు. ఈ మేరకు స్థానిక వేదిక కార్యాలయంలో గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఇక్కడి సమస్యలపై గతవారం స్పందనలో ఫిర్యాదు చేయడంతో జిల్లా గిరిజన వెల్ఫేర్ అధికారి వరలక్ష్మి, తహశీల్దార్ జి.సుజాత పరిశీలించారని, మండలలోని కమ్మవారిపాలెంలో సర్వే నంబర్ 105,140లోని రెండున్నర ఎకరాల్లో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించనట్లు చెప్పారని తెలిపారు.

తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం

ప్రశాంతంగా ముగిసిన తెనాలి కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి- తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ప్రశాంతంగా ముగిసింది. చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తాడిబోయిన రాధిక అధ్యక్షతన కౌన్సిల్ హాలులో గురువారం జరిగిన సమావేశంలో 23 అంశాలతో కూడిన అజెండా చర్చకు వచ్చింది. 11వ అంశం చదువుతుండగా టిడిపి కౌన్సిలర్లు తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, అన్నం పిన్నారావు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో సమస్యలను ప్రస్తావించారు. రక్షిత మంచినీటి పైపులు పలుచోట్ల నిరుపయోగంగా ఉన్నాయని, కొందరు నీటి కుళాయిలను ఉపయోగించక పోయినా వారికి పన్నులు విధించడం సమంజసమా అంటూ ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ ఇంజనీర్ కె నాగమల్లేశ్వరరావు బదులిస్తూ గతంలో పొరపాటున పన్నులు విధించడం జరిగిందని, సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం తెప్పించుకొని కుళాయి ఉపయోగిం చని వారికి పన్ను రద్దు చేసినట్లు చెప్పారు. వాటికి సంబం ధించి సమస్యలను తమ దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరి స్తామన్నారు. 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ మాట్లాడుతూ చెత్త సేకరణ వాహనాలు వార్డులోకి రావడం లేదని, ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడుతు న్నారని చైర్పర్సన్ దృష్టికి తెచ్చారు. దీనిపై శానిటరీ ఇనస్పెక్టర్ డి శ్రీనివాసరావు బదులిస్తూ చెత్త సేకరణ వాహనాల కాంట్రాక్టర్ డ్రైవర్లకు జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారు విధులకు హాజరు కాలేదన్నారు. ప్రస్తుతం వారికి వేతనాలు చెల్లించడంతో తిరిగి యధావిధిగా పనిచేస్తున్నారన్నారు. వార్డులో చెత్త


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యులు

సేకరణకు సమస్య లేకుండా పరిష్కరి స్తామన్నారు. అధికార పార్టీకి చెందిన13వ వార్డు కౌన్సిలర్ కుర్ర సుజాత వార్డులో అభివృద్ధి పనులు మందగమనంపై చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరిం చాల్సిందిగా కోరారు. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సమావేశం నిర్వహించిన రాధికను ప్రతిపక్ష కౌన్సిలర్ల బృందం ప్రత్యేకంగా


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ టి రాధిక

సత్కరించింది. సమావేశంలో మున్సి పల్ కమిషనర్ ఎం జస్వంతరావు, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, వివిధ విభాగాల అధికారులు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం ఎదుట బిజెపి ధర్నా

ఒకవైపు కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా మరోవైపు బిజెపి శ్రేణులు పురపాలక సంఘం ఎదుట బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. వార్డులలో దోమల తీవ్రత, వీధి కుక్కల సంచారం పెరిగిందని, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ విజయభాస్కర్ రెడ్డి, ఎం రత్నరాజు ప్రసంగించారు.

దశాబ్దాలుగా దళితులకు శ్మశాన సమస్య

మృతదేహాలను పూడ్చడానికి స్థలం లేదు

పరిష్కరించాలని ఎమ్మెల్యేకు కాలనీవాసుల వినతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

దశాబ్దాలుగా చనిపోయిన శవాన్ని పూడ్చి పెట్టడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న వారు లేరని దళితులు వాపోతున్నారు. గురువారం ఆత్మకూరులో పర్యటించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులకు సమస్య పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరుకు చెందిన దళిత మాదిగ సామాజిక తరగతి పేదలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఆత్మకూరు గ్రామంలో దళిత మాదిగలు సుమారుగా 200 కుటుంబాలు నివసిస్తున్నాం. మాకు స్మశాన స్థలం లేదు. గత 50 సంవత్సరాల క్రితం మాకు స్మశాన స్థలం ఉండేది. ఆ స్థలంలో గుంటూరు వాటర్ ఛానల్ వెళ్లిన సందర్భంలో కొంత స్థలం, గుంటూరు కృష్ణావాటర్ స్కీం పైప్ లైన్ వేసిన సందర్భంలో మిగతా స్థలం పోయినది. అప్పటినుంచి మా కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే ఆ పైప్ లైన్ పైనే పూడ్చిపెడుతున్నాము. ఇటీవల గుంటూరు నీటిపారుదల శాఖ వారు వచ్చి శవాలను వాటర్ పైప్ లైన్ పైన పూడ్చి పెట్టవద్దని, అలా పూడ్చి పెడితే నీరు కలుషితం అవుతాయని చెప్పారు. వర్షాకాలం అయితే కాలువ కట్టల పక్కన పూడ్చిపెట్టుకునే దుస్థితి నేడున్నది. ఇదే విషయం గతంలో అనేక గ్రామ సభల్లో ఎమ్మార్వో, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మా సమస్యకు పరిష్కారం చూపలేదు. మా యందు దయవుంచి గుంటూరు ఛానల్ కు దక్షిణ వైపున ఉన్న సర్వే నెంబరు 143/బి లో రెండు ఎకరాలు శవాలను పూడ్చుకోవడానికి స్థలమును కేటాయించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని కోరామని తెలిపారు. నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు నగర్‌లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల 160 కుటుంబాలు 17 సంవత్సరముల నుండి నివసిస్తున్నామని, జగనన్న పక్కా ఇళ్లు నిర్మించుకోవడానికి మాకు ఇంటి పట్టాలు లేని కారణంగా మేము అర్హులం కాలేకపోతున్నామని తెలిపారు. ఇంటి పట్టాలు ఇచ్చి జగనన్న పక్కా గృహాలు


ఎమ్మెల్యే ఆర్కేకు వినతి పత్రం ఇస్తున్న కాలనీ వాసులు

నిర్మించుకోవడానికి అధికారులు, ప్రభుత్వం సహకరించాలని ఎమ్మెల్యేని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితుల శ్మశాన సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. జగనన్న ఇంటి పట్టాలకు సంబధించి రికార్డులను పరిశీలించి అర్హులైన పక్షంలో తప్పనిసరిగా పట్టాలు ఇస్తామని తెలి పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉద్దంటి దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం అజయ్ కుమార్, మునగాల శీను, మహిళా సంఘం సభ్యులు గౌరబత్తుల లక్ష్మి, కటివరపు లక్ష్మి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గురజాడ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు : గురజాడ సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుక వెళ్ళాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. గురువారం బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురజాడ అప్పారావు 108వ వర్ధంతి సభ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర



నివాళులర్పిస్తున్న నాయకులు

పటానికి జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.నేతాజి, ఇతర నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ గురజాడ కుల, మత తత్వాలకు, మూఢనమ్మకాలకు, బాల్య వివాహలకు వ్యతిరేకంగా తన రచనలను కొనసాగించారన్నారు. 'కన్యాశుల్కం' పుత్తడిబొమ్మ పూర్ణమ్మ రచనలు ఆనాటి సామాజిక, ఆర్థిక పరిస్థితికి అద్దం పట్టాయని, ఆయన రచనలు సమాజాన్ని అభివద్ధి పథంలో నడిపించాయన్నారు. తన రచనలన్నీ హేతువాద దృక్పథంతో వున్నాయన్నారు. ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించారన్నారు. 'దేశమును ప్రేమించుమన్నా-మంచియన్నది పెంచుమన్నా' అంటూ దేశభక్తిని పెంపొందించే విధంగా తన రచనలను కొనసాగించారన్నారు. సులభశైలిలో వాడుక భాషలో మొదటిగా తన సాహిత్యాన్ని ప్రజలకు అందించారని చెప్పారు. సొంత లాభం కొంత మానుకుని పొరుగువాడికి తోడ్పడాలని ఉద్బోధించారు. ఆయన సాహిత్యాన్ని విస్తతంగా ప్రజల్లోకి తీసుక వెళ్ళాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపియం నాయకులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, కె.నళీనికాంత్, ఎమ్.రవి, బి.ముత్యాలరావు, ఖాశిం షహీద్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఆధునిక మహిళ ప్రపంచాన్ని తిరగరాస్తుంది

గురజాడ వర్ధంతి సభలో విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి

ప్రజాశక్తి-తాడేపల్లి :ఆధునిక మహిళ తన శక్తియుక్తులతో ప్రపంచాన్ని తిరగరాస్తుందని రచయిత, విశ్రాంత ప్రధానోధ్యాయురాలు కావూరి సత్యవతి అన్నారు. గురువారం మహిళా సాధికారత, గురజాడ 108వ వర్ధంతి సభలు తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లోని కుట్టు శిక్షణా కేంద్రం, కుంచనపల్లి అరవింద హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలకు తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, అరవింద ఉపాధ్యాయులు హనుమంతరావు అధ్యక్షత వహించారు. సత్యవతి మాట్లాడుతూ బ్రిటీష్ పాలన పోయి స్వాతంత్ర్యం వచ్చినా మూఢనమ్మకాలు, పురుషాధిక్య సమాజం అలాగే ఉన్నాయని వివరించారు. పదేళ్ల అమ్మాయికి 40 ఏళ్ల వ్యక్తితో పెళ్లి చేసే సంప్రదాయం నెలకొని ఉందని చెప్పారు. భర్త చనిపోతే తెల్ల చీర కట్టుకోవాలని, బొట్టు పెట్టుకోకూడదని, బజారులో తిరగకూడదని, ఎవరికీ ఎదురుగా రాకూడదని ఇలాంటి దురాచారాలు అన్నింటినీ ఆనాటి పురుషాధిక్య సమాజం ప్రోత్సహించిందని వివరించారు. భర్త చనిపోతే బతికున్న భార్యను కూడా ఆయన చితిపై పెట్టి సతీసహగమనం దురాచారం వేళ్లానుకుని ఉండేదని చెప్పారు. గురజాడ, రాజారామ్మోహన్‌రాయ్, జ్యోతిరావు పూలే తదితర మహనీయులు ఈ దురాచారాలను



మాట్లాడుతున్న సత్యవతి వేదికపైన స్వరూపరాణి తదితరులు

ఎండగట్టారని తెలిపారు. ఆత్మాభి మానం, స్వాభిమానం, అభిమానంతో బతకాలని మహిళలకు సూచించారు. పిల్లలు మగ, ఆగ ఎవరైనా సరి సమానంగా పెంచాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించ డాన్ని స్వాగతించారు. విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.స్వరూపరాణి మాట్లాడుతూ ఒకరికి ఒకరు తోడుగా ఉండి ఐక్యమత్యంగా ఉండటమే మహిళల శక్తి, ధైర్యం అని చెప్పారు. నేటికీ అనేక చోట్ల మహిళలపై హింస జరగడాన్ని ఆక్షేపించారు. మద్యం మహమ్మారికి కుటుంబాలు బలైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర బాధ్యులు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ తాడేపల్లిలో మహిళా కుట్టుశిక్షణా నైపుణ్య శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో రెండు బ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వి కార్యక్రమంలో ఎంబివికె బాధ్యులు పి.విజయ, తాడేపల్లి విజ్ఞాన కేంద్రం బాధ్యులు గాదె సుబ్బారెడ్డి, అరవింద హైస్కూల్ ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి, ప్రధానోపాధ్యాయులు రవిశంకర్ పాల్గొన్నారు.

7వ తేదీలోగా టేక్ హోం రేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి నెలా ఇస్తున్న టేక్ హెూం రేషన్ ప్రక్రియను డిసెంబర్ 7వ తేదీలోగా పూర్తి చేయాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఐసిడిఎస్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ, జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజి మాట్లాడుతూ ప్రతి నెలా 5వ తేదీలోగా టేక్ హెూం రేషన్ పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తారని, అందుకు భిన్నంగా ఈనెల 8వ తేదీన ఇవ్వాలని చెబుతున్నారన్నారు. డిసెంబర్ 8 నుండి అంగన్‌వాడీల సమ్మె ప్రారంభం అవుతున్నందున లబ్ధిదారులకు రేషన్ నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. కావున లబ్ధిదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 7వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు



మాట్లాడుతున్న రామ్మోహనరావు

జెకెసిలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులపై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి ఉన్నత విద్యామండలి, జెకెసి కాలేజి సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్-2024 అనే అంశంపై ఒక్కరోజు కార్యశాల జెకెసి కాలేజి ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఎపి ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు కె.రామ్మోహనరావు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఉన్నత విద్యలో నైపుణ్యం, నాణ్యతకు ప్రాముఖ్యత పెరిగిన నేపథ్యంలో బోధన, శిక్షణా తరగతులలో మార్పులు చేసుకోవాలని సూచించారు. ఇటువంటి కార్యశాలలు జాతీ స్థాయిలో మెరుగైన ర్యాంకుల సాధనకు ఉపయోగపడతాయన్నారు. చెన్నైలోని లయోలా కళాశాల ఐక్యూఎయస్ సమన్వయకర్త డాక్టర్ ఆర్.రవీంద్రన్ ఎన్ఐఆర్ఎఫ్ మంచి ర్యాంకు సాధించటానికి కావాల్సిన అంశాలను వివరించారు. ఉన్నత విద్యామండలి క్యూఎసి అకడమిక్ అధికారి జి.శ్రీరంగం మాథ్యూ ఎన్ఐఆర్ఎఫ్‌లో విభిన్న అంశాలను వివరించారు. కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, ఏలూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ కళాశాలలకు చెందిన ప్రిన్సిపల్స్ ఐక్యూఎసి సమన్వయకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెకెసి కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పి.జి కోర్సుల డైరెక్టర్ యస్ఆర్‌కె.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపింద్ అధ్యాపకులు పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో ఓటర్ల స్పెషల్ క్యాంపెయిన్

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో అన్ని పోలింగ్ బూత్‌ల్లో డిసెంబర్ 2,3 తేదీల్లో ఓటర్ల స్పెషల్ క్యాంపెయిన్ డేస్ ని నిర్వహిస్తున్నామని నగర కమిషనర్, తూర్పు ఈ.ఆర్.ఓ. కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజక వర్గాలలోని 532 పోలింగ్ బూత్‌లలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు చేపడుతున్న ఈ క్యాంపెయిన్‌లో భాగంగా భాగంగా బిఎల్‌ఓలు ఓటర్ల జాబితా, వివిధ ఫారాలతో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ ఓటు ఉన్నది, లేనిదీ స్వయంగా పరిశీలించుకోవాలని, ఓటర్ కార్డులో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే సంబందిత బిఎల్‌ఓకి నిబంధనల మేరకు తగిన ఆధారాలతో దరఖాస్తు పూర్తిచేసి అందించాలని పేర్కొన్నారు. క్యాంప్‌లలో ప్రజల నుండి నూతన ఓటుకు దరఖాస్తులు, ఓటర్ కార్డ్‌లో చిరునామా, పేరు, పుట్టిన తేది తదితర మార్పులకై అర్జీలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదలకు ఎన్నికల సంఘం గడవు ప్రకటించినందున, ఓటర్ల జాబితా ముసాయిదా సవరణకు ఇదే ఆఖరి అవకాశం కనుక నగరంలో 18 ఏళ్లు నిండి ఓటు అర్హత కల్గిన యువత స్వచ్ఛందంగా ఓటు కోసం ఫారం -6ని పూర్తి చేసి ఓటు హక్కుని పొందాలని కోరారు. ఇప్పటికే జిఎంసి ప్రధాన కార్యాలయంలో ఓటర్ల హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, ఓటుకి సంబంధించిన సమాచారం కోసం 0863-2345104, 2345105 నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.


పంచాయతి కార్యదర్శులకు కిట్లు అందజేస్తున్న ఎంపిడిఒ జీవి సత్యనారాయణ

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని సత్తెనపల్లి ఎంపిడిఒ జీవి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతి కార్యదర్శులకు క్రీడా పరికరాల కిట్లను గురు వారం ఆయన పంపిణీ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ డిసెంబర్ 15 నుండి 2024 జనవరి 3 వరకు వివిధ స్థాయిల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. క్రీడాకారులు వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి–పెదకూరపాడు

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. పెదకూరపాడు మండలంలోని కన్నెగండ్ల పాఠశాలలో ఈ సందర్భగా ఓ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుజ్జి, ఫౌండేషన్ సభ్యులు మాగు లూరి కృష్ణారావు,కిరణ్ కుమార్ కుంచనపల్లి, కొండవీటి ప్రసాద్,బండారుపల్లి సిద్దయ్య,మోదుగులు చంద్రశేఖర్,వెంకట్రావు,ఉపసర్పంచ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి–సత్తెనపల్లి రూరల్



సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు గా పనిచేస్తున్న గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి (52) గురు వారం రాత్రి మృతి చెందాడు. గుండెపోటుతో విజయవాడ లోని ప్రైవేటు ఆసుపత్రి లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్రీనివాసరెడ్డి స్వామి వివేకానంద చైతన్య భారతి కోశాధికారి గా పనిచేస్తున్నారు. శ్రీనివాసరెడ్డి మృతికి పలువురు ఉపా ధ్యాయులు, స్వామి వివేకానంద చైతన్య భారతి సభ్యులు సంతాపం ప్రకటించారు.

వరిలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి- బెల్లంకొండ

మండలంలోని మాచాయపాలెంలో గురువారం వరి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. 5X5 మీటర్ల విస్తీర్ణంలో నిర్వహించిన పంటకోత ప్రయోగము లో మాచాయపాలెంకు చెందిన అంబటి శ్రీను పొలంలో 6.21 కేజీలు తడి ధాన్యం దిగుబడి నమోదు చేశారు. ఈ కార్యక్రమాన్ని టి. మధు సూదననరావు , ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతి నిధి ఎస్కె జానీ బాషా పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య, గ్రామ ఉద్యాన సహాయకులు ప్రత్యుష పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె సైరన్

- న్యాయమైన సమస్యలు పరిష్కరించండి
- ఎపి అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో అంగన్వా డీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేయలేదని ఎపి అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి విమర్శించారు. స్థానిక పల్నాడు విజ్ఞాన కేం ద్రంలో గురువారం ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. మల్లీశ్వరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కన్నా వెయ్యి రూపా యలు అదనంగా ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టు కోలేదని, దీనిని నిరసిస్తూ ఈ నెల 8 నుండి సమ్మె చేపట్టనున్నట్టు చెప్పారు. మాతాశిశు సంరక్షణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సమీకృత బాలల అభివృద్ధి పథకంలో సిబ్బంది పలు సమ స్యలతో సతమతమవు తున్నారని, ప్రభు త్వం రకరకాల యాప్ ల పేరుతో పని ఒత్తిడికి గురిచేస్తోందని, బిల్లులు మం జూరులో జాప్యం తదితర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత రెండేళ్లుగా ఎన్నో పోరా టాలు చేసినప్పటికీ ప్రభుత్వం దిగి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. యాప్ లు అన్నింటిని తొలగించి ఒక యాప్ ద్వారానే కార్యక్రమం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చిన ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇంతవరకు ఆ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేదని మండిపడ్డారు. ప్రభుత్వం, ప్రజా ప్రతి నిధులు అధికారులు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా సమస్యలు పరిష్కరించే వరకు నిరసన తప్పదని హెచ్చరించారు.

యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెపి మెటిల్డా దేవి మాట్లాడుతూ అంగన్వాడీలతో వెట్టిచాకిరి చేయించుకుని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏమి ఇవ్వకుండా వారిని ఇంటికి పంపిస్తున్నారన్నారు. రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, ఈ నేపథ్యంలోనే అర్హులకు పదోన్నతులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2017 నుండి అంగన్వాడీలకు టిఎ బిల్లులు ఇవ్వలేదని, ఎట్టి పరిస్థితిలో డిసెంబర్ 8 నుండి సెంటర్లు ఓపెన్ చేసే ప్రసక్తే లేదని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, పదవీ విరమణ సాయం కింద రూ 5 లక్షలకు పెంచాలని, మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, మొదలైన డిమాండ్లు చేశారు. కార్మిక సంఘాల మద్ద తుతో చేపట్టనున్న సమ్మె సమస్యలు పరిష్కరించే వరకూ కొన సాగుతుందన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి



అంగన్వాడీ లు రోడ్డెక్కడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శన మని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీ నర్ డి.శివకుమారి విమర్శించారు. ఐసి డిఎస్ కు నిధులు కేటాయించి పేస్ యాప్ నిర్ణయాన్ని ఉపసంహరించాలని, అమ్మ ఒడి ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు వర్తింపజేయాలని, నాణ్యమైన సరుకులను ప్రభుత్వమే ఇవ్వాలని, విధుల్లో మృతి చెందిన అంగ న్వాడీలకు సిబ్బంది కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని, తల పెట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.


సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

చరవాణి లు సక్రమంగా పనిచేయట్లేదు



ప్రభుత్వం సర ఫరా చేసిన చరవాణిలు సక్రమంగా పనిచేయక పోవడంతో అంగ న్వాడీలు ఇబ్బంది పడు తున్నారని యూనియన్ జిల్లా కోశాధికారి ప్రసన్న అన్నారు. దీంతో వారిపై పని ఒత్తిడి అధికమైందని, రూ.11,500 వేతనంతో ప్రస్తుత నిత్యావసరాల ధరలతో పోల్చి అంగన్వాడీలు ఎలా బ్రత కాలో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని అన్నారు. ఎన్ని ఒత్తిడులకు గురి చేసినా సమ్మెకు దిగడ ఖాయమని స్పష్టం చేశారు.

డిమాండ్లు నెరవేర్చండి



అంగన్వాడీ ల డిమాండ్లు నెరవేర్చాలని నరస రావుపేట ప్రాజెక్టు కార్యదర్శి నిర్మల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేత నాలు తక్కువ అయినప్పటికీ కష్టపడి అంగన్వాడీ విధులు నిర్వ ర్తిస్తున్నారని,. చాలా ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్య వలన ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్ సక్రమంగా పని చేయడం లేదని అన్నారు. అన్ని హామీలను, కనీస వేతనాలు అమలు చేయాలనేది తమ ప్రధాన డిమాండ్ అన్నారు.

యాప్‌లతో పని ఒత్తిడి పెరిగింది



గత ప్రభుత్వ హయాంలో ఒక యాప్ ఉండేదని, ప్రస్తుతం రాష్ట్రానికి సంబంధించి వైఎస్సార్, కేంద్రానికి సంబంధించి పోషణ ట్రాకర్ యాప్ లను ప్రవేశపెట్టారని నరసరావుపేట ప్రాజెక్ట్ లీడర్ మాధవి అన్నారు. హాజరు , మరుగుదొడ్లు, గృహ సందర్శన వంటి కార్యక్రమాలను యాప్‌లో నిక్షిప్తం చేయాలని, ప్రతి నెలా లబ్ధిదారుల ముఖ చిత్రాలు, పోషకాహార నిల్వలు, చిన్నారుల ఎత్తు, బరువు,ఇతర సామాగ్రి వివరాలు అందులో పొందుపరచాలని అన్నారు. గ్రామీణ ప్రాంత కేంద్రాల వద్ద సర్వర్లు సక్రమంగా పనిచేయక ఆయా వివరాలను నమోదు చేయడం సవాలుగా మారుతోందని, పని ఒత్తిడి పెరుగుతోదని అన్నారు. ఆయా యాప్‌లను కుదించి ఒక యాప్ తో సరిపెట్టాలని కోరారు.



అవగాహనా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరరావు

ఓటు విలువ తెలుసుకోండి

ప్రజాశక్తి–అమరావతి

అర్హత ఉన్న యువతీయువకులు ఓటరుగా నమోదు చేసు కునేందుకు ముందుకు రావాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నం బూరు శంకరరావు పిలుపు నిచ్చారు. స్థానిక ఆర్‌వివిఎన్ కళా శాలలో ఓటు హక్కు రిజిస్ట్రేషన్‌పై గురువార నిర్వహిచిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాలొని మాట్లాడుతూ డిసెంబర్ 9 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంద న్నారు. దర ఖాస్తులపై అవగాహన కల్పించారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1950కు డయల్ చేయవచ్చని వివరించారు.

లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేత

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వాటిని గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు షేక్ మస్తాన్ వలి, అమరావతి బంక బాబుకు ఒక్కొక్కరికీ రెండు లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి నుంచి వైసిపిలోకి చేరికలు

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేస్తున్న అభివృద్ధిని వచ్చి ఎంతోమంది వైసీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే శంకరరావు గురువారం అన్నారు. ఈ సందర్భంగా మునుగోడు లో 13 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలో చేరారు. ఎమ్మెల్యే స్వయంగా కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - అచ్చంపేట

సత్తెమ్మ తల్లి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గురువారం మాదిపాడు సమీ పంలోని అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమా నికి ఆయన హాజరయ్యారు నూతన కమిటీ సభ్యుల చేత దేవాదాయ శాఖ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. దేవస్థాన కమిటీ ఛైర్మన్‌గా కొరివి వెంకట నరేష్, బోర్డు సభ్యులుగా భూక్యా సీతాబాయి, మూఢావత్ బద్రియా నాయక్, మునగాల వెంకటనరసమ్మ, పాతూరి హనుమయ్య, నంబూరి మహేష్, కంబాల నరసమ్మ, వల్లపరపు నాగ మణి, తూమాటి వెంకటరమణతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యులుగా కె.పెద్ద సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు.

చెరువు కట్ట ఆక్రమణలు తొలగించండి

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సత్తెనపల్లి రోడ్ లో కత్వ చెరువు కట్ట ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి, నిర్మించిన భవనాలను వెంటనే తొలగించాలి పిడియం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లా డుతూ ఆవుల సత్రం సమీపంలో ఉన్న కత్వ చెరువు చుట్టు పక్కల చెరువులో కొంత భాగం ఆక్రమించి భవన నిర్మాణాలు చేపట్టి అక్కడ విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు.



కుంచనపల్లిలో 'జగనన్న ఎందుకు కావాలి?'

ప్రజాశక్తి–తాడేపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ కు జగనన్న ఎందుకు కావాలి? అంటే ప్రజలందరి ఆనందం కోసమేనని తాడేపల్లి రూరల్ వైసిపి అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి అన్నారు. గురువారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి సచివాలయ పరిధిలో వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలోని ప్రజలకు చేరవేసిన సంక్షేమ లబ్ధి బోర్డును ప్రారంభించారు. అనంతరం వి.ఎం. రంగా విగ్రహం వద్ద వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేకానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంటిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారి గోపాలకృష్ణ, సెక్రటరి గోపాలరెడ్డి, సచివాలయ అడ్మిన్ బాషాబాయ్, వైఎస్సార్సీపీ బీసీ సెల్ నాయకులు కత్తిక రాఘవరావు,జిల్లా సభ్యులు అమరా నాగయ్య, కుంచనపల్లి వైఎస్సార్సీపీ అధ్యక్షులు మిరియాల రాంబాబు, గృహ సారథులు రాంబాబు, చాగంటి రాజారెడ్డి, సడపర్తి నాగమల్లి, వైఎస్సార్సీపీ నాయకులు గడ్డం తాతయ్య, విజయేంద్రరావు, చాగంటి బాపిరెడ్డి, దొంతిరెడ్డి తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ పనులు వెంటనే పూర్తి చేయాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన నల్లమడ రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-పెదనందిపాడు



తహసిల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుంటూరు ఛానల్‌ను పొడిగించాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో పెదనంది పాడు లో చేపట్టిన నిరసన దీక్ష గురు వారం 11వ రోజుకు చేరుకుంది, నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఈ ప్రాంత ప్రజలు సాగు, తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నల్లమడ వాగులో వచ్చే ఉప్పు నీటినే రైతులు సాగుకు వాడుకోవడం వల్ల భూ సారం దెబ్బతింటుందని తెలిపారు. వెంటనే నిధులు కేటాయించి గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు, అనంతరం దీక్షా వేదిక నుండి, మండల తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి, తహసిల్దార్ షేక్ మహబూబ్ సుభాని కు వినతి పత్రం అందజేశారు, కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి, ముప్వ పెద్దన్న, కొల్లా రామన్, వీరగంధం వెంకయ్య, వి గోవిందరాజులు, తుమ్మల సరళ దేవి, ఈదర భ్రమరాంబ, కొల్లా నిర్మల, లావు చౌడేశ్వరి పాల్గొన్నారు.

ప్రజలందరికీ అందుబాటులో మత్స్య ఉత్పత్తులు

ఫిష్ ఆంధ్ర రిటైల్ షాపు ప్రారంభంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య

ప్రజాశక్తి - చేబ్రోలు



మత్స్యకారులకు గౌరవప్రదమైన జీవనోపాధికి అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కిలారి రోశయ్య అన్నారు. గురువారం చేబ్రోలు అప్పాపురం కాలువ పక్కన నాలుగు మినీ ఫిష్ ఆంధ్ర షాపులను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసంగించారు. పరిశుభ్రమైన నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చొరవతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర బ్రాండ్ నేమ్ తో పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ రిటైల్ అవుట్ లెట్స్ ఏర్పాటు ద్వారా మత్స్యకారులకు గౌరవప్రదమైన జీవనోపాధికి అవకాశం ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని పెంచుతూ తద్వారా ప్రజలకు సరసమైన ధరలో పోషకాహార విలువలతో కూడిన ఆహారము అందించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దీని ద్వారా ప్రస్తుతం ఉన్న 9కేజీల వినియోగం నుండి 20 కేజీలకు పెంచాలని లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించారని తెలిపారు. చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో ప్రథమ స్థానంలో ఉందని, రొయ్యల ఉత్పత్తి 76శాతం రాష్ట్రం నుండి అధికంగా ఉన్నప్పటికీ, చికెన్ మటన్ కంటే చేపల వినియోగం చాలా తక్కువగా ఉన్నదని తెలిపారు. దీనిని అధిగమించడానికి డొమెస్టిక్ మార్కెటింగ్ పథకం ద్వారా దేశీయ వినియోగం పెంచడానికి ఫిష్ ఆంధ్ర కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. చేపల వ్యాపారం చేయడానికి ఔత్సాహితులైన వారికి ఈ పథకము ద్వారా 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వము అవకాశం కల్పిస్తుందని తెలిపారు. మండలానికి సంబంధించి దరఖాస్తు చేసుకొనదలచిన వారు నిడుబ్రోలు ఫిషరీస్ ఆఫీసులో కానీ, గుంటూరు జిల్లా ఫిషరీస్ ఆఫీసులో కానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ కె వి గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, జిల్లా ఫిషరీస్ అధికారి పి గాలి దేవుడు, గుంటూరు ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్లు మహమ్మద్ జేనుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఎఎన్ఎమ్‌లను రెగ్యులర్ చేయాలి

వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి నివాస్‌కు వినతి

ప్రజాశక్తి-మంగళగిరి

రాష్ట్రంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయాలని కోరుతూ, నగరంలోని ఏపీఐఏసి భవనంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నివాస్‌ను కలిసి సెకండ్ ఏఎన్ఎం ఏపీ స్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2007, 2008, 2009 సంవత్సరాలలో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్ఎంలుగా విధుల్లో చేరామని చెప్పారు. తమ సొంత మండలాలలో నిర్దేశించిన సబ్ సెంటర్లలో గత 16 సంవత్సరాలుగా తక్కువ వేతనాలకు పని చేస్తున్నామని, కోవిడ్ సమయంలో ఎందరో సెకండ్ ఏ ఎన్ ఎమ్ లు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని అయినప్పటికీ వారి కుటుంబాలకు తగిన పారితోషం కూడా అందించలేదని వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సెకండ్ ఏఎన్ఎం లను రెగ్యులర్ చేస్తానని గతంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయా పరిస్థితుల నేపథ్యంలో సెకండ్ ఏ ఎన్ ఎమ్ లను రెగ్యులర్ చేసి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని నివాస్ ను కోరారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయచంద్ర, అసోసియేషన్ నాయకులు

రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం కాస్వీ దంత వైద్యశాల, సూర్య డయాగ్నోస్టిక్స్ సౌజన్యంతో నిర్వహించారు. కాస్వీ హాస్పిటల్ డాక్టర్ జి.విజయచంద్ర తన సిబ్బందితో పాల్గొని ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు దంత పరీక్షలు నిర్వహించటంతోపాటు, దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సూర్య డయాగ్నోస్టిక్స్ సిబ్బంది బాడీ చెకప్, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇహెచ్ఎస్ కార్డులపై నగదు రహిత ఆపరేషన్లు చేసే సౌకర్యం ఉందని డాక్టర్ విజయచంద్ర తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 175 మంది ఉద్యోగులు, పెన్షనర్లు వైద్యసేవలు పొందినట్లు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. తొలుత కార్యక్రమాన్ని ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కె.సంగీతరావు ప్రారంభించగా, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు సిహెచ్.సుధాకర్ బాబు, ఎన్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1న 99 మంది మహిళలకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వివిధ రంగాల్లో ప్రావిణ్యత కలిగిన 99 మంది మహిళలకు మార్చి 1న అమరావతిలో అవార్డులను ప్రధానం చేయనున్నట్టు శర్వాణా, ఎన్ఆర్ మీడియా సంస్థ నిర్వహాకులు జి.ఎన్.రవిచంద్ర, డి.శ్రీనాథ్,నిర్వహాకులు రమేష్ యాదవ్ తెలిపారు. గుంటూరులోని ఒక హోటల్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ 9 రంగాల నుంచి ప్రతిభ కలిగిన మహిళలను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి విభాగంలో 9 మంది ఉంటారని మొత్తం 99 మందికి అవార్డులు ఇస్తామన్నారు. రాజకీయ, విద్య, వైద్యం, పోలీసు, సాంఘీక సేవ,. మీడియా, సినిమా, క్రీడా, పారిశ్రామిక రంగాలకుచెందిన మహిళలను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఈ అవార్డుల ప్రధానంకు ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, సినీ ప్రముఖులు, పలువురు మహిళా ప్రజా ప్రతినిధులు హాజరు అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా శక్తి ఉమెన్ ఐకాన్ లోగోను నగరడిప్యూటీ మేయర్ సజీల ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ అన్నిరంగాలకు చెందిన మహిళలను ప్రోత్సహించడం ముదావాహం అన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ సజీల తదితరులు

ఇప్పటివరకు ఇంత భారీగా మహిళలను ఎవ్వరూ ఎంపిక చేయలేదన్నారు. మీడియా సమావేశంలో పి.దుర్గాభవానీ, జి.లత, టి.విజయదుర్గ ప్రసాద్, సాయికుమార్, రాయుడు తదితరులుపాల్గొన్నారు.

కార్మిక నేత కామేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు : ఎస్.ఏ.ఎస్.కామేశ్వరరావు త్యాగం వెలకట్టలేనిది అని విద్యుత్ శాఖ కార్మిక సంఘాల నేతలు అన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కార్మికుల భవిష్యత్ సక్షేమం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న కార్మికరత్న స్వర్గియ ఎస్. ఏ.ఎస్ కామేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు శాఖ కార్యాలయాలలో కామేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి-తెనాలి రూరల్ :విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి వేజ్ రివిజన్ పొందడానికి కారణమైన ఎస్ఎఎస్ కామేశ్వర రావు కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని విద్యుత్ శాఖ కార్మిక సంఘ రాష్ట్ర నాయకులు పరిస వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కామేశ్వరరావు వర్ధంతి సందర్భంగా చెంచుపేట డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట నెలకొన్న కామేశ్వరరావు విగ్రహానికి తెనాలి డివిజన్ విద్యుత్ శాఖ ఇఇ ఆపరేషన్స్ వివి చిరంజీవి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రాఫ్ట్ మాన్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన కామేశ్వరరావు కార్మికులు కష్టాలను చూసి కలత చెందారన్నారు. విద్యుత్ సర్కిల్, డివిజన్, రెవెన్యూ కార్యాలయాల్లో కార్మికులను ఐక్యం చేసి రిజిష్టర్ నంబర్ 3341 ద్వారా విద్యుత్ ఉద్యోగసంఘ్ స్థాపించారని తెలిపారు. బోనస్ చట్టాన్ని కార్మికులకు కూడా వర్తింపజేసి, ప్రెవెన్షియల్ సిబ్బందికి తమ సర్వీసులను రెగ్యులరైజేషన్ చేయించారన్నారు. విద్యుత్ బోర్డు యాజమాన్యంతో పోరాడి బోర్డు స్కేల్ ఏర్పాటుకు చేస్తున్న పోరాటంలో విద్యుత్ సౌదా చైర్మన్ చాంబర్ ముందు 1973లో నిప్పంటించుకొని ఆత్మాహుతి చేసుకున్నారని తెలిపారు. మెరుగైన జీత భత్యాలు కార్మికులు అందుకోవడానికి ప్రధాన కారణమైన కామేశ్వరరావును స్మరించుకోవాలని యూనియన్ నాయకులు ఆర్ మోహన్ రావు, సిహెచ్ పురుషోత్తం తెలిపారు.



గుంటూరులో కామేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



తెనాలిలో

కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షురాలిగా షేక్ నగీన

ప్రజాశక్తి - తాడికొండ



తాడికొండ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ శాఖ నుంచి షేక్ నగీనాను సొసైటీ అధ్యక్షురాలుగా త్రిసభ్య సభ్యులతో కూడిన కమిటీ నియమిస్తూ ఉత్తర్వులు వెలువడటంతో ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా షేక్ నగీన మాట్లాడుతూ తొలిసారి ముస్లిం మహిళకు ప్రాధాన్యత ఇచ్చి తాడికొండ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షురాలిగా ఎంపిక చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సొసైటీ సీఈవో సుజనీ చేతుల మీదుగా నియామక పత్రం అందుకొని బాధ్యతలు స్వీకరించారు. తనకు పదవి వచ్చేం దుకు సహకరించిన తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల కోసం పనిచేసి, రుణాలు, ఎరువులు సకాలంలో అందించి సొసైటీ అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు.

65 మందికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరిలో మహిళల జీవనోపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్త్రీశక్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి అన్నారు. స్త్రీ శక్తి ద్వారా మంగ ళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాల్లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 34వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 65 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, మంగళగిరి పట్టణ తెలుగు మహిళ కార్యదర్శి సింహాద్రి బేబీ రాణి, మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఎలమంచిలి పద్మజ, పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత : మంగళగిరి పట్టణంలోని రు వ్యాపారులకు ఏడుగురికి గురువారం నలుగురికి టిఫిన్ బండ్లు, ముగ్గురికి వెల్డింగ్ మిషన్లు టిడిపి నాయకులు పంపిణీ చేశారు.

తెనాలి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పిక్నిక్

ప్రజాశక్తి-తెనాలి రూరల్ :మున్సిపల్ విభాగంలో సేవలందిస్తున్న నాయకులు, ఉద్యోగులు, కార్మికులు ఐకమత్యంగా కార్తీక వన సమారాధన లాంటి ఆటవిడుపు కార్యక్రమాలు నిర్వహించుకోవడం మదావహమని తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక చినరావూరు పార్క్‌లో గురువారం ఆంధ్రా పారిస్ మున్సిపల్ ఎంపాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన పిక్నిక్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గున్నారు. కులం పేరుతో ఎవరికివారు వనభోజనాలు నిర్వహించుకుంటున్న తరుణంలో అందరూకలసి ఒకేచోట వనబోజనాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వైసిపి, టిడిపి కౌన్సిలర్లు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులతో కలసి సంగీత విభావరి, విందు ఏర్పాట్లలో పాల్గొన్నారు. మున్సి పల్ ఛైర్పర్సన్ తాడిబోయిన రాధికరమేష్, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం జస్వంతరావు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణ ప్రముఖ పురోహితులు జి.యస్. ఆర్. వరదాచార్యులు (నాని) ఆధ్వర్యంలో కార్తీక మాసము, చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని జి.వి.ఆర్. ఆచార్యులు అండ్ రఘునాథాచార్యులు వేదిక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరిలో పేదలకు, చైతన్య కృష్ణ, చైతన్య సౌజన్య వృద్ధాశ్రమంలో దుప్పట్లు, చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీసామ్రాజ్యం కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

అమ్మ సేవా నిలయంలో నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పసుపులేటి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయముతో కసుకర్రురోడ్డు లోని అమ్మ సేవా నిలయంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్, కుటుంబ సభ్యులు పసుపులేటి సాయికిరణ్, పసుపులేటి మణి, వర్మ వీరనాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్

ప్రజాశక్తి-గుంటూరు


అధ్యాపకుల్ని అభినందిస్తున్న వీసీ

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయి పేటెంట్ వచ్చిందని వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణం తెలిపారు. గురువారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ ఎన్.ఎస్ .సంపత్‌కుమార్, డాక్టర్ దిరిశాల విజయరాము, ముగ్గురు విద్యార్థులు సంయుక్తంగా ప్రతిపాదించిన 'యాన్ ఎడిబుల్ ఫ్లేవర్ ఎన్‌హ్యాన్స్ ఫ్రమ్ పెరిగోప్తలిస్ పార్డాలిస్' అనే అంశానికి ప్రముఖ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఇండియా అథారిటీ పేటెంట్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. వీరు ప్రతిపాదించిన ఈ పేటెంట్‌కు 20 సంవత్సరాల పాటు హక్కులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పేటెంట్ ప్రతిపాదనలో బయోటెక్ విద్యార్థులైన కె.మదులాచౌదరి, టీ.సతీష్‌కుమార్, జే.జాస్మిన్ రెడ్డి ముఖ్యభూమిక పోషించారని తెలిపారు. పెరిగోప్తలిస్ అనే చేప కొల్లేరు సరస్సుల్లో విరివిగా లభిస్తూ మిగిలిన అన్ని చేపలకు హానికలగచేస్తూ పర్యావరణ అసమతుల్యానికి కారణమవుతున్న తరుణంలో ఈ ఇద్దరు అధ్యాపకులు, బయోటెక్నాలజీ విద్యార్థులు కలిసి ఈ సమస్యను విశ్లేషించారన్నారు. ఈ చేప నుంచి పోషక విలువలు కలిగిన పొడిని బయోటెక్ పద్ధతిలో రూపొందించి తినుబండారాల తయారీలో వీటిని ఉపయోగించవచ్చని కనుగొన్నారని తెలిపారు.. మిక్కిలి ఇష్టంగా తీసుకునే తినుబండారాలలో ఉండటం వలన పిల్లల్లో పోషక విలువలు పెరుగుదలకు అంతర్లీనంగా ఈ పొడి దోహదపడుతుందని వివరించారు. జాతీయ స్థాయి పేటెంట్ పొందిన అధ్యాపకులు డాక్టర్ ఎన్.ఎస్.సంపత్ కుమార్, డాక్టర్ దిరిశాల విజయరాములను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ ప్రత్యేకంగా అభినందించారు.

మన నిర్ణయాలే ఉత్తమ భవిష్యత్‌కు నాంది

భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న భాష్యం రామకృష్ణ

మనం తీసుకునే నిర్ణయాలే మన జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయని, మన చర్యలే ఉత్తమ భవిష్యత్‌కు నాంది పలుకుతాయని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. గురువారం గోరంట్ల భాష్యం టెన్త్ క్యాంపస్‌లో పదో తరగతి విద్యార్థులకు రాబోయే పరీక్షల నేపథ్యంలో చైర్మన్ రామకృష్ణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలు అనుసరించి భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. స్వీయ ప్రేరణతో ఏది మంచి, ఏది చెడు అన్న విచక్షణతో నడుచుకోవాలని, తద్వారా ఉన్నతంగా ఎదుగుతారని అన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి తమను తాము మలుచుకొని, వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. పరీక్షల వేళ ప్రణాళికాబద్ధంగా మీ దినచర్యను రూపొందించుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో ఎంతటి లక్ష్యాన్నైనా సునాయాసంగా సాధించవచ్చని దీనికి ఎంతో మంది మహనీయులు ప్రేరణగా నిలిచారన్నారు. విద్యార్థి జీవితం అన్ని భావోద్వేగాల కలయిక అని, దానిని ఎలా మలచుకుంటారో మీ చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ముఖ్య సలహాదారు మైఖేల్‌రాజు, జెడ్‌ఈఒలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఫిక్కీ అవార్డు

ఉపాధి కల్పనలో ఉత్తమ యూనివర్సిటీగా గుర్తింపు



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ఏపీ ఎస్ ఆర్ఎం యూనివర్సిటీ మరో ప్రతిష్టాత్మ కమైన అవార్డును సొంతం చేసుకుంది. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో సమర్ధ వంతమైన పనితీరు కనబరిచి ఉత్తమ యూని వర్సిటీగా ప్రతిష్టాత్మక ఫిక్కీ పురస్కారాన్ని దక్కించుకుంది. ఢిల్లీలోని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) వారు ఏటా విద్యా సంబంధ అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరిచే ఉన్నత విద్యా సంస్థలను గుర్తించి జాతీయ స్థాయిలో అవార్డులను ప్రదానం చేస్తుంటారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం న్యూఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో ఫిక్కీ 9వ ఉన్నత విద్యా పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని ఉత్తమ యూనివర్సిటీగా ఎంపిక చేసి అవార్డును అందజేసింది. వర్సిటీ తరపున యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కల్లూరి వినాయకర్, క్వాలిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ కార్తీక్ రాజేంద్ర నిర్వాహకుల నుంచి అవార్డును అందుకున్నారు. ఫిక్కీ అవార్డు రావడానికి కారణమైన కార్పొరేట్ రిలేషన్స్ అండ్ కెరీర్ సర్వీసెస్ డైరెక్టరేట్ కు యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, విసి ఆచార్య మనోజ్కుమార్ అరోరాలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

డాక్టర్ కార్తీక్ కు యంగ్ సైంటిస్ట్ అవార్డు : త్రివేండ్రం లోని బయోటెక్ రీసెర్చ్ సొసైటీ 2022 సంవత్సరానికి గాను పరిశోధనా రంగంలో విశేష సేవలు అందిస్తున్న శాస్త్రవేత్తలకు అవార్డులను వెల్లడించింది. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని ఎన్విరాన్మెంట్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కార్తీక్ రాజేంద్రను ప్రతిష్టాత్మక 'యంగ్ సైంటిస్ట్ అవార్డును ప్రకటించింది. త్రివేంద్రలోని రెసిడెన్సి హోటల్లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ జీడీ యాదవ్ చేతుల మీదుగా కార్తీక్ అవార్డును అందుకున్నారు. పురస్కారం కింద రూ.25 వేల నగదు పారితోషికం, మొమెంటో, ప్రశంసాపత్రాన్ని కార్తీక్ రాజేంద్ర కు అందజేశారు.

కాలం చెల్లిన మందులు స్వాధీనం

మెడికల్ షాపుల్లో విజిలెన్సు తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో కాలం చెల్లిన మందులను విజిలెన్సు అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. బిల్లులు లేకుండా కాలం చెల్లిన మందులు అమ్ముతున్నారని వచ్చిన సమాచారంతో తనిఖీలు చేసినట్టు అధికారులు తెలిపారు. విజిలెన్స్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి స్థానిక డ్రగ్స్ ఇన్స్పెక్టర్ తో కలసి గుంటూరు నగరం లోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. కొరెటిపాడు, రైలు పేటల లోని మూడు హోల్ సేల్ మెడికల్ స్టోర్‌లలో పలు లోపాలను కనుగొన్నారు. కొరిటపాడు పళని మెడికల్ ఫార్మసీ లో పెద్ద మొత్తంలో కాలం చెల్లిన మందులను గుర్తించారు. ఫార్మసిస్టు లేకుండా మందులు విక్రయి స్తున్నారని గుర్తించారు. రైలు పేట లోని అంజనాద్రి మెడికల్ ఎంటర్ ప్రైజెస్ లో బిల్లులు లేకుండా, బిల్లులపై సంతకములు లేకుండా హోల్ సేల్ లో మెడిసిన్స్ విక్రయిస్తున్నట్టు గుర్తించారు. డ్రగ్స్, కాస్మెటిక్ రూల్స్ వుల్లంఘించి నందులకు ఈ దుకాణాలపై కేసులు నమోదు చేశామని అధి కారులు తెలిపారు. పెద్ద మొత్తంలో కాలం చెల్లిన మందులు ఉన్నందున కఠినచర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా మెడికల్ ఫార్మసీ లైసెన్స్ రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్టు విజిలెన్సు సిఐలు ఎ.శ్రీహరి రావు, ఎస్.శ్రీనివాసులు రెడ్డి, స్థానిక డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఎన్. మహేశ్, ఎస్.వి.ఎన్. పద్మ విజిలెన్స్ సిబ్బంది పాల్గొనినారు.

ప్రజ్ఞ కరస్పాండెంట్ చక్రనాగ్‌కు జాతీయ స్థాయి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న నాయుడు చక్రనాగ్

ప్రజాశక్తి-గుంటూరు: నేషనల్ ఇండిపెండెన్స్ స్కూల్స్ అలయన్స్ (నీక్ష్మీయా) హర్యానా రాష్ట్రం, చండీగఢ్‌లో నిర్వహించిన 'స్కూల్ లీడర్స్ సమ్మిట్ 2023'లో నగరానికి చెందిన ప్రజ్ఞ విద్యాసంస్థ కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్‌ను నిసా చైర్మన్ కులభూషణ్‌శర్మ, హర్యానా స్కూల్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ విపి యాదవ్‌లు 'డైనమిక్ లీడర్' అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా చక్ర నాగ్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పేద మధ్యతరగతి వర్గాల ప్రజలకు అందిస్తున్న క్వాలిటీ ఎడ్యుకేషన్‌తో పాటు విద్యార్థుల సమగ్ర అభివద్ధికి కషి చేస్తున్న సందర్భంగా జాతీయ అవార్డుతో సత్కరించారని తెలిపారు. కరస్పాండెంట్ చక్ర నాగ్ జాతీయ పురస్కారం అందుకోవటం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.


4 నుండి టిజెపిఎస్‌లో వాలీబాల్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రహ్మం, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక టిజెపియస్ కళాశాలలో ఈనెల 4-6 తేదీల్లో నిర్వహిస్తున్న ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు(పురుషులు) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎబిపి మనోహర్ తెలిపారు. ఈమేరకు గురువారం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాండంట్ కెవి బ్రహ్మం చేతులమీదుగా బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందడానికి క్రీడలు దోహదం చేస్తాయని, అంతే కాకుండా క్రీడాకారులలో నైపుణ్యం వెలికితీసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడే విధంగా అద్భుతమైన అవకాశాలు ఈ క్రీడలు కల్పిస్తాయని, ఈ అవకాశాన్ని యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలలు వినియోగించుకుని అభివద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చైర్మన్ ఏ.బి.పి. మనోహర్, టోర్నమెంట్ సెక్రటరీ ఆర్.శివాజీ, జాయింట్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు, సభ్యులు డాక్టర్. జె.వి.సుధీర్‌కుమార్, జి.సురేష్, మేజర్.పి.కుమార్‌రాజా, స్వామి పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ బయోపిక్ రెండో షెడ్యూల్ ప్రారంభం


క్లాప్ కొడుతున్న డాక్టర్ యశోదర, కౌన్సిలర్ సురేంద్ర

ప్రజాశక్తి - తెనాలి : భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ బయోపిక్ రెండో షెడ్యూల్ షూటింగ్ గురువారం స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణ మండపంలో ప్రారంభం అయ్యింది. దర్శకులు దిలీప్ రాజా సారథ్యంలో రూపుదిద్దుకుంటున్న బయోపిక్‌కు డాక్టర్ యశోధర పువ్వాడ, కౌన్సిలర్ గెడ్డటి సురేంద్ర క్లాప్ కొట్టారు. జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర సంగ్రామంలో గాంధీజీతో రెండు పర్యాయాలు చెరసాలకు వెళ్లిన సన్నివేశాలు తెనాలిలోను, మిగిలిన సన్నివేశాలను హైదరాబాదులో చిత్రీకరించినట్టు దర్శకులు చెప్పారు. జగజ్జీవన్ రామ్‌గా మిలటరీ ప్రసాద్, లాల్ బహదూర్ శాస్త్రిగా అమీర్ చౌదరి, గాంధీజీ పాత్రలో కేఆర్. డి.శెట్టి, గాంధీజీ అనుచరులుగా పూజా, సుశీల, దళిత నాయకుడిగా చదలవాడ హరిబాబు నటించారు. కెమెరామెన్ వంశీ, సహాయ దర్శకులు ధనుష్, ఈశ్వర్, మేకప్ మెన్ వెంకటేశ్వర్, సురేష్ నాయక్, ప్రొడక్షన్ కంట్రోలర్ ఐ రాజేష్, నిర్మాత ఆలూరి సుందర రామయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు అనుకూల మీడియాపై ఫిర్యాదు

నందమూరి లక్ష్మీపార్వతి ప్రకటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అనుకూల మీడియాతో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో ఎ.పి. ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'తెలుగు మీడియా గమనం-గమ్యం అనే అంశంపై గురువారం సదస్సు జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కష్ణంరాజు అధ్యక్షతన వహించారు. లక్ష్మీపార్వతి మాట్లాడుతూ చంద్రబాబు అనుకూల వర్గ మీడియా గతంలో ఎన్.టి.రామారావు ప్రభుత్వాన్ని కూల్చి ందని, ప్రస్తుతం జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి రాకుండా చేయడానికి కుట్రలు పన్నుతోందన్నారు. ఈ మీడియా వైఖరిపై త్వరలోనే ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయబోతున్నామని ఆమె చెప్పారు. కష్ణంరాజు మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్రం సర్వతోముఖాభివద్ధి సాధిస్తుండగా చంద్రబాబు అనుకూల మీడియా మాత్రం రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకంజలో ఉందంటూ అసత్య ప్రచారం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ అడ్వకేట్ చండూరు సుందంˇరామ శర్మ, అడ్వకేట్స్ ఫోరం కన్వీనర్ బి. అశోక్ కుమార్, నవ్యాంధ్ర ఇంటిలెక్చ్యువల్ ఫోరం ఛైర్మన్ ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రమణ్యం, మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కె. సలీం మాలిక్ , మేకల కోటేశ్వరరావు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రసంగించారు.

నేడు, రేపు వర్సిటీలో ఫైన్ ఆర్ట్స్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎఎన్‌యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్ మెంటు ఆఫ్ ఫైన్ ఆర్ట్స ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో అఖిలభారత ఫైన్ ఆర్ట్స ఫెస్ట్, ఆర్ట్ ఎక్సిబిషన్ 2023 ను నిర్వహిస్తున్నట్లు విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ జి. అనిత, అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి .శేఖర్ బాబులు తెలిపారు. ఈ ఫెస్టులో వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 7 విశ్వవిద్యా లయం నుంచి ఫైన్ ఆర్ట్స కోర్స్ చదువుకున్న విద్యార్థులు పాల్గొంటా రన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమ ంలో చిత్రకళ, శిల్పకళా ప్రదర్శన, వర్క్ షాప్, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతా యని వివరించారు. డిస్టెన్స్ బిల్డింగ్ లోని ఆర్ పిక్చర్ కళాశాలలో ఉన్న ఫైనాన్స్ విభాగంలో ఉదయం 10 గంటల నుంచి ఆర్కే ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమా నికి విసి ప్రొఫెసర్ పి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. రెక్టర్ ప్రొఫెసర్ పి.వర ప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి .కరుణ, ఆశ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ స్వరూపారాణి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఈ శ్రీనివాసరెడ్డి స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స అసిస్టెంట్ కోఆర్డినేటర్ పాల్గొంటారని చెప్పారు.